
నమస్తే తెలంగాణ

ఖమ్మం

5 | ఖమ్మం, బుధవారం 12 జూన్ 2024 | KHAMMAM





నగరంలోని రిక్కాబజార్ పాఠశాలలో అధ్వానంగా ఉన్న టాయిలెట్స్

ఈ చిత్రాలు చూశారా.. జిల్లాకేంద్రం ఖమ్మం నగరంలోని నడిబొడ్డున ఉన్న పాత బస్టాండ్ వద్ద గల రిక్కాబజార్ పాఠశాలలోనివి. నిత్యం కలెక్టర్, మంత్రులు తిరుగుతున్న ప్రాంతంలోని ప్రభుత్వ పాఠశాలలోనే మూత్రశాలల దుస్థితి ఇలా ఉందంటే.. మిగతా వాటి పరిస్థితి ఏంటో అర్థం చేసుకోవచ్చు. బుధవారం నుంచి బడులు పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా విద్యార్థులకు ఇలాంటి సమస్యలెన్నో స్వాగతం పలుకుతున్నాయి.

- ప్రారంభంకానున్న కొత్త విద్యా సంవత్సరం
- ప్రభుత్వ పాఠశాలల్లో వీడని సమస్యల తంటా
- పూర్తిస్థాయిలో సన్నద్ధం కాని బడులు
- వంతుల వారీగా నిర్వహించిన బడిబాట
- కుట్టు పనుల కోసం ఇతర జిల్లాలకు తరలిన ఉచిత యూనిఫాం
- భర్తీకాని ఉపాధ్యాయ పోస్టులు

# నేటి నుంచి బడిగంట



ఖమ్మం, జూన్ 11 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు ఈ నెల 12వ తేదీ బుధవారం పునఃప్రారంభం కానున్నాయి. ఖమ్మం జిల్లాలోని అత్యధిక ప్రభుత్వ పాఠశాలలు విద్యార్థులకు సమస్యలతో స్వాగతం పలుకనున్నాయి. ప్రభుత్వం, జిల్లా అధికార యంత్రాంగం గొప్పలు చెబుతున్న పరిస్థితి క్షేత్రస్థాయిలో లేదు. తాగు నీటి సరఫరా మొదలు టాయిలెట్స్, విద్యుత్ సరఫరా వంటివి ఖమ్మం నగరంలోని ప్రధాన కూడళ్లలో ఉన్న పాఠశాలల్లోనే అధ్వానంగా ఉన్నాయంటే.. గ్రామీణ ప్రాంతాల్లోని పాఠశాలల పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. మన ఊరు-మన బడి ద్వారా గత కేసీఆర్ ప్రభుత్వం పాఠశాలలను అద్భుతంగా తీర్చిదిద్దింది. అయితే ప్రస్తుత ప్రభుత్వంలో అధికారుల కనీస పర్యవేక్షణ లేకపోవడంతో పాఠశాలలు అధ్వానంగా తయారయ్యాయి.

**వంతుల వారీగా బడిబాట**

రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 6వ తేదీ నుంచి బడిబాట కార్యక్రమాన్ని మొదలుపెట్టింది. అయితే జిల్లాలోని చాలా స్కూళ్లలో టీచర్లు వంతుల వారీగా హాజరై మమ అనిపించినట్లు ఆరోపణలున్నాయి. కలెక్టర్ వీపీ గౌతమ్, డీఈవో సోమశేఖర శర్మ ఏయే మండలాలకు హాజరవుతున్నారో ముందుగానే తెలుసుకొని ఆరోజు మాత్రమే కొంతమంది ఉపాధ్యాయులు బడిబాటలో పాల్గొంటున్నారంటే అతిశయోక్తి కాదు. మరికొందరు ఉపాధ్యాయులు బడిబాటలో పాల్గొనకపోయినప్పటికీ హాజరైనట్లు తప్పుడు నివేదికలను అధికారులకు అందజేస్తున్నారు. వీరికి కొందరు ఎంఈవోలు సైతం సహకారం అందిస్తున్నట్లు డీఈవోకి మౌఖికంగా ఫిర్యాదులు కూడా అందాయి.

**కట్టేవారున్నా.. కుట్టేవారేరి?**

ప్రభుత్వ యాజమాన్యాల పరిధిలోని పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు రెండు జతల యూనిఫాం రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా అందజేస్తున్నది. యూనిఫాంలను కుట్టేందుకు మండలాల వారీగా అక్కడ ఎస్‌హెచ్‌జీ గ్రూప్‌లకు క్లాత్‌ను అందించాలని ఆదేశించింది. కుట్టేవారు లేకపోతే డీఆర్‌డీఏ, మెప్మాల పరిధిలో కుట్టించాలని ఆదేశాల్లో స్పష్టంగా పేర్కొంది.. కానీ.. ఖమ్మం జిల్లాలో మాత్రం అత్యధికంగా యూనిఫాం ఇతర జిల్లాలతోపాటు వేరే రాష్ట్రానికి కూడా తరలివెళ్లింది. ఏపీ రాష్ట్రంలోని గుంటూరు, కృష్ణా జిల్లాలో సైతం ఉచిత యూనిఫాంను కుట్టిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. ఇదిలా ఉంటే.. కుట్టు పనులు 95 శాతం పూర్తయ్యాయని అధికారులు చెబుతున్నప్పటికీ వాస్తవంలో మాత్రం 60 శాతంలోపే సిద్ధమైనట్లు తెలుస్తున్నది.

**టీచర్ పోస్టుల భర్తీ జరిగేనా?**

జిల్లాలో ప్రభుత్వ యాజమాన్యాల పరిధిలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలు 1,004 ఉండగా.. ఉన్నత పాఠశాలలు 214 వరకు ఉన్నాయి. వీటిల్లో చదువుతున్న విద్యార్థులకు తెలుగు, ఇంగ్లిష్ మీడియంలో బోధన నిర్వహిస్తున్నారు. గత కేసీఆర్ ప్రభుత్వ తీసుకున్న చర్యల వలన అన్ని మారుమూల ప్రాంతాల్లోని పాఠశాలలకు టీచర్లను కేటాయించారు. ప్రస్తుత ప్రభుత్వం పాలనలో ఇటీవల ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయుల స్థానాలు, ఖాళీలను భర్తీ చేసేందుకు ఎలాంటి చర్యలు తీసుకోకుండానే బడులు పునఃప్రారంభమవుతున్నాయి. జిల్లావ్యాప్తంగా ఉన్న పాఠశాలల్లో మంజూరైన పోస్టులు 5,755. వీటిల్లో ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో కలిపి 3,197 మంది కాగా.. ఉన్నత పాఠశాలల్లో 2,558 మంది పని చేయాల్సి ఉంది. 2024 జూన్ 1 నాటికి 4,629 మంది ఉపాధ్యాయులు పనిచేస్తుండగా.. 1,126 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఈ పోస్టుల స్థానంలో విద్యా వలంటీర్లను నియమిస్తారా..? ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి.

## విద్యార్థులకు ఇబ్బంది రానివ్వం..



పాఠశాలల పునఃప్రారంభానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. ఒక జత యూనిఫాం పూర్తయింది. రెండో జత సిద్ధమవుతున్నది. 6వ తరగతికి సంబంధించిన పుస్తకాల విషయంలో కొన్ని మండలాలకు తక్కువ వచ్చాయి. దీనిపై ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చాం. నోట్ పుస్తకాలు కూడా మండలాలకు సరఫరా చేశాం. ఎక్కడైనా టాయిలెట్స్ సమస్యలు ఉంటే మరమ్మతులు చేపడతాం.. విద్యార్థులకు ఇబ్బందులు రాకుండా చూస్తాం.

**-సోమశేఖర శర్మ, డీఈవో, ఖమ్మం**

# ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య

**బడిబాటలో విద్యార్థుల నమోదు పెరగాలి**

**రమణగుట్ట పర్యటనలో ఖమ్మం కలెక్టర్ వీపీ గౌతమ్**




బడిబాట కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ గౌతమ్

ఖమ్మం, జూన్ 11 : ప్రైవేటు పాఠశాలల్లో కంటే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని, ప్రతీ విద్యార్థి ఉన్నత స్థాయికి ఎదిగేలా ఉపాధ్యాయులు మెరుగైన బోధన అందిస్తున్నారని కలెక్టర్ వీపీ గౌతమ్ అన్నారు. ఖమ్మం నగరంలోని రమణగుట్టలో మంగళవారం నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి ర్యాలీ తీస్తూ విద్యా ప్రాముఖ్యతను తెలిపే విధంగా నినాదాలు చేశారు. కలెక్టర్ ఇంటింటికీ తిరుగుతూ ఇంట్లో చదువుకున్న పిల్లలు ఉన్నదీ, ఏ పాఠశాలలో చదువుతున్నది అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ బడీడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించే విధంగా బడిబాట కార్యక్రమాన్ని ప్రభుత్వం ఈ నెల 6 నుంచి 19వ తేదీ వరకు నిర్వహిస్తుందని తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ ఉపాధ్యాయులు, సిబ్బంది ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు శాతం పెరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి ఉత్తీర్ణతా శాతం పెరిగిందని, ప్రైవేట్ కంటే మెరుగ్గా ఫలితాలు సాధిస్తున్నామన్నారు. ఎలాంటి ఖర్చు లేకుండా ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్యతోపాటు ఉచిత పాఠ్య, నోట్ పుస్తకాలు, దుస్తులు విద్యార్థులకు అందుతున్నాయని తెలిపారు. విద్యార్థులు ఐఐటీ, నీట్ ఫలితాల్లో మంచి ప్రదర్శన కనబరుస్తున్నారని, క్రీడా పోటీల్లో సైతం సత్తా చాటుతున్నారని అన్నారు. అంతకుముందు కలెక్టర్ ఎన్నెస్పీ కాలనీలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సందర్శించి.. అభివృద్ధి పనులను పరిశీలించారు. పాఠశాలలకు యూనిఫాం, పాఠ్య పుస్తకాలు వచ్చాయా.. లేదా.. అని అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్య, కొత్తగా ఎంతమంది నమోదయ్యారని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డీఈవో సోమశేఖర శర్మ, ఖమ్మం అర్బన్ ఎంఈవో శ్రీనివాసరావు, హెచ్‌ఎంలు శంకర్‌రావు, పద్మజ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.




# నూతన ఒరవడి సృష్టిస్తున్న ఖమ్మం ప్రైవేట్ పాఠశాలలు

**నూతన విద్యా విధానంలో విద్యార్థులకు బోధన**


**విద్యాభివృద్ధే లక్ష్యంగా కృషి చేస్తున్న విద్యాసంస్థలు**



ఖమ్మం ఎడ్యుకేషన్, జూన్ 11 : పాఠశాల విద్యలో అత్యుత్తమ నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ.. విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుతూ నూతన ఒరవడిని సృష్టిస్తున్నాయి ఖమ్మంలోని ప్రైవేట్ పాఠశాలలు. ఎల్‌కేజీ స్థాయి విద్య నుంచి పదో తరగతి వరకు స్టేట్ సిలబస్‌తోపాటు సెంట్రల్ సిలబస్‌లోనూ పాఠశాలలు నిర్వహిస్తూ జిల్లా విద్యార్థులకు అన్ని రకాల కోర్సులతో విద్యను అందుబాటులోకి తెచ్చాయి. ప్రతి విద్యార్థి పట్ల వ్యక్తిగత శ్రద్ధ కనబరుస్తూ.. చదువులో ప్రగతిని పెంచడంతోపాటు మెరికల్లా తీర్చిదిద్దుతూ తల్లిదండ్రుల్లో నమ్మకాన్ని పెంచుతున్నాయి. విద్యార్థుల్లో మానసికోల్లాసం కలిగించేందుకు ఆటపాటల్లోనూ తర్ఫీదునిస్తూ ప్రోత్సహిస్తున్నాయి. కార్పొరేట్ విద్యా సంస్థలకు పోటీగా సాధారణ ఫీజులతో విద్యాబోధనలో ఏ మాత్రం వ్యత్యాసం లేకుండా డిజిటల్ విధానంలోనూ బోధిస్తూ అర్థవంతమైన తీరును అమలు చేస్తూ ఉత్తమ ఫలితాలు రాబడుతున్నాయి. ఆహ్లాదకరమైన వాతావరణంలో పాఠశాలలు నిర్వహిస్తూ.. సుహృద్భావ పోటీని నెలకొల్పుతూ.. విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తూ.. స్ఫూర్తిని నింపుతూ విజయపథంలో పయనిస్తున్నాయి. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు పాటుపడుతూ విద్యాభివృద్ధే లక్ష్యంగా కృషి చేస్తూ ఉత్తమ విద్యాసంస్థలుగా రాణిస్తున్నాయి.

**ఉత్తమ ఫలితాలు...**

జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలలు తమ ప్రభావాన్ని చాటుతున్నాయి. విద్యాపరంగా ప్రదర్శిస్తున్న పనితీరు, రాబడుతున్న ఫలితాలతో హైదరాబాద్ తర్వాత ఖమ్మం జిల్లా ఎడ్యుకేషన్ హబ్‌గా పేరొందింది. విద్యార్థులకు చదువుతోపాటు నైతిక విలువలు, సామాజిక స్పృహ వంటి అంశాలపై పూర్తిస్థాయిలో అవగాహన కలిగిస్తూ తమ భాధ్యతను నెరవేరుస్తున్నాయి. ప్రైవేట్ పాఠశాలలకున్న ఆదరణతో ప్రతి సంవత్సరం నూతనంగా కొత్త పాఠశాలలు నెలకొల్పుతున్నారు. అత్యున్నతమైన విశ్వవిద్యాలయాల్లో ఉన్నత చదువులు చదివిన వారిని ఉపాధ్యాయులుగా నియమించి చిన్నారుల నుంచి భవిష్యత్ తరాలను సృష్టిస్తున్నారు. నియమ నిబంధనలు పాటిస్తూ.. బీఈడీ, డీఈడీ పూర్తి చేసిన వారితోనే విద్యా భోధన చేయిస్తూ నాణ్యతా ప్రమాణాలు పాటిస్తున్నాయి. ప్రైవేటు పాఠశాలలు పదో తరగతి ఫలితాల్లో అత్యధిక టెన్ జీపీఏలతో రాణిస్తూ సత్తా చాటుతున్నాయి. వివిధ పోటీ పరీక్షల్లో రాణించడంతోపాటు జాతీయస్థాయి కార్యక్రమాలు, పోటీల్లో ప్రతిభను కనబరిచేలా విద్యార్థులను సన్నద్ధం చేస్తున్నారు. విద్యార్థుల ప్రగతితో పాఠశాలల బోధనా తీరు పట్ల తల్లిదండ్రులు సంతృప్తి వ్యక్తపరుస్తున్నారు.


























## వివరాల్లేకుండా సమీక్షకెలా వస్తారు?

**ఇకపై సాకులు చెప్పొద్దు.. మొదటిసారి కాబట్టి వదిలేస్తున్నా..**

**నియోజకవర్గాల్లో సమస్యలుంటే ఎమ్మెల్యేలకు చెప్పండి**

**రెవెన్యూ, హౌసింగ్ శాఖల సమీక్షలో మంత్రి పొంగులేటి**




మాట్లాడుతున్న రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

భద్రాద్రి కొత్తగూడెం, జూన్ 11 (నమస్తే తెలంగాణ): 'సమగ్ర వివరాలు లేకుండా సమీక్షకు ఎలా వస్తారు? ఇకపై సాకులు చెప్పొద్దు.. మొదటిసారి కాబట్టి వదిలేస్తున్నా..' అంటూ భద్రాద్రి జిల్లా అధికారులపై రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖల జిల్లా స్థాయి సమీక్ష సమావేశాన్ని భద్రాద్రి ఐడీవోసీ సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. తదుపరి సమీక్ష నాటికి అధికారులు సరైన వివరాలతో రావాలని సూచించారు. అప్పటికీ లోపాలుంటే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ఈ ప్రభుత్వంపై ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నందున అధికారులు అందుకు అనుగుణంగా పనిచేయాలని సూచించారు. నియోజకవర్గాల్లో సమస్యలుంటే ఎమ్మెల్యేలను సంప్రదించాలని, వారి ద్వారా ఆయా సమస్యలను పరిష్కరించాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్లు, తాగునీరు, విద్య, వైద్యం, గ్రామీణ రోడ్లు, కల్వర్టుల మీద సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారని అన్నారు. అర్హులైన వారికి ఆసరా పింఛన్లు అందించాలని, గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించాలని, అంగన్‌వాడీలు, ప్రభుత్వ పాఠశాలల్లో మరమ్మతులుంటే వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. నియోజకవర్గ ప్రజాప్రతినిధులను సంప్రదించి పాఠశాలల పునఃప్రారంభాన్ని పండుగ వాతావరణంలో చేయాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న ధరణి సమస్యలను పరిష్కరించాలన్నారు. వర్షాకాలం ప్రారంభమైనందున వైద్య శాఖ అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. జడ్పీ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు, ఎమ్మెల్యేలు కూనంనేని సాంబశివరావు, పాయం వెంకటేశ్వర్లు, కోరం కనకయ్య, మాలోత్ రాందాస్‌నాయక్, తెల్లం వెంకట్రావు, జారె ఆదినారాయణ, కలెక్టర్ ప్రియాంక, ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్, అదనపు కలెక్టర్ వేణుగోపాల్, డీఆర్వో రవీంద్రనాథ్, ఆర్డీవోలు మధు, దామోదర్‌రావు, డీఎఫ్‌వో కృష్ణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.